సాక్షి
సంగారెడ్డి
శుక్రవారం । 28 । ఏప్రిల్ । 2023



అంతా సిద్ధం.. 8లో
ఉమ్మడి మెదక్‌జిల్లావ్యాప్తంగా నవోదయ ఎంట్రెన్స్ టెస్ట్‌కు రంగం సిద్ధమైంది. ఈ నెల 29న నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వ హణకు ఆయా జిల్లాల యంత్రాంగం సన్నద్ధమైంది.



అకాలవర్షంతో నష్టం 9లో
గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో మొక్కజొన్న, సోయాజీన్, కూరగాయల పంటలతో పాటు మామిడి, వరి పంటలకు అపార నష్టం వాటిల్లింది.

అందరికీ నెగెటివ్
పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు కొనసాగుతున్నాయి. గురువారం 13 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీసీపీఆర్ టెస్టులు 11 మందికి చేసినట్లు పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

బెల్టు షాపులను మూసివేయాలి

పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): యువత మద్యం మత్తులో పెడదోవపడుతోందని, తక్షణమే గ్రామాల్లోని బెల్ట్ షాపులను మూసివేసిలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సంగారెడ్డిలోని ఎక్సైజ్ కార్యాలయంలో సూపరింటెండెంట్ గాయత్రికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో మద్యం ఏరులై పారుతోందని, ప్రజలు మద్యానికి బానిసలుగా మారుతున్నారన్నారు. మద్యం మత్తులో హత్యలు, అత్యాచారాలు పాల్పడుతున్నారని ఆరోపించారు. కల్తీ కల్లుతో ప్రజల ప్రాణాలు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కల్తీ కల్లు తయారీదారులుపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, అల్ఫ్రాజోలం నిషేధించాలని డిమాండ్ చేశారు. బెల్టుషాపులు మూసివేయాలని, గంజాయి విక్రేతలపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారి శ్రీకాంత్, డివిజన్ నాయకులు సునీల్, సిద్దార్థ్, వంశీ, దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

జేపీఎస్‌ను క్రమబద్ధీకరించాలి



ఆందోళన చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

సంగారెడ్డి టౌన్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే క్రమబద్ధీకరించాలని జిల్లా అధ్యక్షుడు నీరడి రాజు అన్నారు. గురువారం సంగారెడ్డిలో శాంతియుతంగా ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ కాలం పూర్తి చేసుకున్న పంచాయతీ కార్యదర్శులను తక్షణమే పర్మినెంట్ చేయాలన్నారు. ఏ ప్రభుత్వ ఉద్యోగి కైనా రెండేళ్ల ప్రొబేషనరీ ఉంటే జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు మాత్రం నాలుగేళ్ల ప్రొషనరీ విధించారన్నారు. జేపీఎస్‌ల క్రమబద్ధీకరణపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించడమే కాకుండా, పనిభారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. జేపీఎస్‌లను తక్షణమే పర్మినెంట్ చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ప్రియాంక, విక్రమ్, నిషా, అన్నీ మండల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

29, 30 తేదీలలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

జోగిపేట(అందోల్): ఈనెల 29, 30 తేదీలలో జోగిపేట పట్టణంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామని అందోల్ జోగిపేట మున్సిపల్ కౌన్సిలర్ కోరబోయిన నాగరాజు గురువారం తెలిపారు. జిల్లాలోని క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. జోగుపేటలోని ఎన్టీఆర్ స్టేడియంలో పోటీలకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి కింద రూ.40 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు, మూడు, నాల్గవ బహుమతులకు రూ.10 వేల చొప్పున అందజేస్తున్నామన్నారు. వీటితో పాటు బెస్ట్ ఆల్ రౌండర్, బెస్ట్ రైడర్, బెస్ట్ డిఫెండర్ కు ట్రోఫీలు అందజేస్తామన్నారు. పోటీలను ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జయపాల్ రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. విశిష్ట అతిథిగా బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ హాజరవుతున్నారని పేర్కొన్నారు. పోటీలో పాల్గొనదలచిన క్రీడాకారులు ఎంట్రీ ఫీజు రూ.700 చెల్లించాల్సి ఉంటుందన్నారు. 28వ తేదీ మధ్యాహ్నం క్రీడా జట్టు డ్రా తీయబడుతుందని, పోటీల్లో అంపైర్‌దే తుదినిర్ణయమన్నారు. ఒక జట్టులో ఆడిన వారు మరో జట్టులో ఆడడానికి అవకాశం లేదన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ జట్ల పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

సంగమేశ్వరకు శ్రీకారం



మునిపల్లి మండలంలో సంగమేశ్వర పథకం సర్వే పనులను ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు (ఫైల్)

రేపు ఎత్తిపోతల పనులను ప్రారంభించనున్న మంత్రి హరీశ్‌రావు

- 2.19 లక్షల ఎకరాలకు అందనున్న సాగునీరు
- సాగునీటి గతిని మార్చనున్న పథకం

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లా సాగునీటి గతిని మార్చే సంగమేశ్వర ఎత్తిపోతల పథకం పనులకు నీటి పారుదలశాఖ శ్రీకారం చుట్టనుంది. ఈ పనులను శనివారం మంత్రి టి.హరీశ్‌రావు ప్రారంభించనున్నారు. ఈ మేరకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. జిల్లాలో మొత్తం 3.86 లక్షల ఎకరాలకు సాగునీరందించేందుకు సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించిన విషయం విదితమే. అయితే ఇప్పటికే బసవేశ్వర ఎత్తిపోతల పథకం పనులను ఈ ఏడాది శివరాత్రి నాడు ప్రారంభించారు. తాజాగా సంగమేశ్వర ఎత్తిపోతల పథకం పనులకు కూడా శ్రీకారం చుట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ రెండు ఎత్తిపోతల పథకాల పనులకు గత ఏడాది నారాయణఖేడ్‌లో సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ఈ పథకం పనులన్నీ పూర్తయితే జిల్లాలోని 2.19 ఎకరాలకు సాగునీరు అందుతుందని నీటిపారుదల శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

సింగూరు నుంచి ఎత్తిపోతలు

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన కొముర వెల్లి మల్లన్నసాగర్ జలాశయం నుంచి లింక్ కాలువ ద్వారా 12 టీఎంసీల నీటిని సింగూరు జలాశయానికి తరలిస్తారు. అక్కడి నుంచి నీటిని ఎత్తిపోసుకునేలా నీటి పారుదలశాఖ ఈ పథకానికి రూపకల్పన చేసింది. ఈ పథకం పనుల్లో భాగంగా మునిపల్లి మండలం చిన్నచల్మెడతో పాటు, జహీరాబాద్ మండలం హోతి(కె)ల వద్ద రెండు పంప్ హౌస్‌లను నిర్మించి నీటిని ఎత్తిపోయనున్నారు. 188 కి.మీల పొడవున ప్రధాన కాలువ, 383 కి.మీ.ల మేరకు డిస్ట్రిబ్యూటరీలు నిర్మించి ఆయకట్టుకు నీటిని తరలించేలా పథకానికి రూపకల్పన చేశారు.

డిజైన్‌లో మార్పులు

సంగమేశ్వర ఎత్తిపోతల పథకం పనుల్లో స్వల్ప మార్పులు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న డిజైన్‌లో కొన్ని మార్పులు చేర్పులు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ మార్పులు, చేర్పుల విషయాలను నీటిపారుదలశాఖ అధికారులు వెల్లడించడం లేదు. ఈ విషయమై 'సాక్షి' నీటిపారుదలశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయ్‌కుమార్‌ను సంప్రదించగా ఆయన పనుల్లో బిజీగా ఉన్నానని తెలిపారు.

పథకం	: సంగమేశ్వర ఎత్తిపోతల పథకం
నీటి కేటాయింపులు	: 12 టీఎంసీలు
ఆయకట్టు	: 2.19 లక్షల ఎకరాలు
పరిధి	: జహీరాబాద్, సంగారెడ్డి, ఆందోల్ నియోజక వర్గాల్లో 231 గ్రామాలు
అంచనా వ్యయం	: రూ.2,653 కోట్లు
విద్యుత్ అవసరం	: 113 మెగావాట్లు
పంప్‌హౌస్‌లు	: 2, చిన్న చల్మెడ (మునిపల్లి మండలం), హోతి–కె (జహీరాబాద్ మండలం)
ప్రధాన కాలువ పొడువు	: 188.3 కి.మీ.లు
డిస్ట్రిబ్యూటరీల పొడవు	: 383.7 కి.మీ.లు
మైనర్ కాలువల పొడువు	: 386.6 కి.మీ.లు

మండలాల వారీగా ఆయకట్టు

న్యాల్‌కల్	: 21,880
జరాసంఘం	: 24,535
మొగుడంపల్లి	: 23,000
జహీరాబాద్	: 22,415
కోహీర్	: 11,429
రాయ్‌కోడ్	: 29,940
మునిపల్లి	: 35,876
సదాశివపేట	: 37,525
కొండాపూర్	: 8,730
సంగారెడ్డి	: 2,435
కంది	: 1,235

పట్టుదలకు ప్రతిరూపం భగీరథ మహర్షి

అదనపు కలెక్టర్ వీరారెడ్డి



భగీరథ మహర్షి జయంతిలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి

సంగారెడ్డిటౌన్: పట్టుదల, కృషితో ఏదైనా సాధించవచ్చన్న దానికి మహర్షి భగీరథుడే నిదర్శమని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లో భగీరథ మహర్షి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగీరథ ప్రయత్నంతోనే గంగ దివి నుంచి భువికి వచ్చిందన్నారు. దేశ సంస్కృతిని సుసంపన్నం చేయడంలో పూర్వం నుంచి ఎంతోమంది ఋషులు కృషి చేశారన్నారు. జిల్లా కేంద్రాల్లో సగర సమాజానికి స్థలం కేటాయించి, భవన నిర్మాణం చేయాలని, స్వయం ఉపాధి రంగంలో వారికి కేటాయింపులు చేయాలని సగర కుల ప్రతినిధులు అదనపు కలెక్టర్‌కు పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఫిరంగి, సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యలక్ష్మి, సూపరింటెండెంట్ వెంకట నరసమ్మ, రాష్ట్ర సగర సంఘం ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

మనువాదం మానవాళికే ప్రమాదం

ఓయూ ప్రొఫెసర్ ఖాశిం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఖాశిం

కొండాపూర్(సంగారెడ్డి): మనువాదం మానవాళికి ప్రమాదకరమని, మహాత్మ జ్యోతిబాపూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ లక్ష్యాలను, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ చింతకింది ఖాశిం పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి సంగారెడ్డి అంబేడ్కర్ చౌరస్తాలో కేవీపీఎస్, సామాజిక ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పూలే, అంబేడ్కర్ జనజాతర బహిరంగసభ నిర్వహించారు. ఐబీ గెస్ట్ హౌస్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు నీలిదండు కవాతు నిర్వహించారు. అనంతరం కాశీం మాట్లాడుతూ మనువాదానికి, భారత రాజ్యాంగానికి మధ్య దేశంలో ఒక అంతర్యుద్ధం కొనసాగుతుందన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు మాట్లాడుతూ కేంద్ర బీజేపీ సర్కార్ అనుసరిస్తున్న విధానాలు రాజ్యాంగాన్ని రద్దు చేయడానికి దోహదం చేస్తున్నాయన్నారు.

వ్యర్థాల వృథాను తగ్గించాలి

డాక్టర్ శ్రీనివాస్

పటాన్‌చెరు టౌన్: ప్రతిపౌరుడు వృథాను తగ్గించేందుకు ప్రయత్నించాలని వాల్యూ ఆనేబ్లర్ అండ్ సోషల్ ఇంపాక్ట్ ప్రోత్సాహిక సభ్యుడు డాక్టర్ శ్రీనివాస్ కేశవరపు అన్నారు. రుద్రారంలోని గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్, స్కూల్ ఆఫ్ సైన్స్‌లో గురువారం వెల్త్ అవుట్ ఆఫ్ వేస్ట్ ్ (చెత్త నుంచి సంపద) పేరిట సంయుక్తంగా నిర్వహించిన ఒకరోజు వర్క్‌షాప్‌కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ చెత్త నుంచి సంపద సృష్టిని పునరుత్పాదక ఆర్థిక వ్యవస్థ (సర్క్యులర్ ఎకానమీ) అంటారన్నారు.

మంజీరా నదిలో భక్తుల పుణ్యస్నానాలు



నది వద్ద భక్తుల సందడి

- వాతావరణం చల్లబడటంతో తరలివస్తున్న జనం
- ఆకట్టుకుంటున్న సాధుసంతుల విన్యాసాలు
- ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు



మంజీరా నది వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఈఓ

న్యాల్‌కల్(జహీరాబాద్): కుంభమేళ ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. న్యాల్‌కల్ మండల పరిధిలోని రాఘవాపూర్–హుమ్నాపూర్ గ్రామాల శివారులోగల పంచవటి క్షేత్రంలో దక్షిణ భారతదేశంలో నాలుగోసారి జరుగుతున్న ఉత్సవాలకు గురువారం రాష్ట్రంలోని నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మంజీరా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులు వేకువ జామునుంచే కుటుంబ సమేతంగా నదికి చేరుకొని పుణ్యస్నానాలు చేసి గంగామాతకు పూజలు చేస్తున్నారు. గురువారం ఉదయం నుంచి వాతావరణం చల్లబడటంతో భక్తుల తాకిడి పెరిగింది. కుంభమేళకు వచ్చిన సాధు సంతులు చేస్తున్న విన్యాసాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సాధు సంతులను, కాశీనాథ్‌బాబాను దర్శించుకున్నారు. అన్నదాన కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతోంది. కుంభమేళకు వచ్చిన భక్తులు పంచవటిలోని ఆలయాలను దర్శించుకుంటున్నారు.

జెడ్పీ సీఈఓ సూచనలు

కుంభమేళా ఏర్పాట్లను జెడ్పీ సీఈఓ ఎల్లయ్య పరిశీలించారు. మధ్యాహ్నం పంచవటికి చేరుకున్న ఆయన నది వద్ద భక్తుల కోసం ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. అనంతరం అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన వెంట డీఎల్‌పీఓ రాఘవారావు, ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రకృతిని కాపాడుకునే ఆలోచన చేయాలి

హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ



మాట్లాడుతున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

పటాన్‌చెరు: స్వార్థం కోసం ప్రకృతిని ధ్వంసం చేయడం కాకుండా, కాపాడుకునేందుకు ఆలోచన చేయాలని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. గురువారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధి శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు, అమీన్‌పూర్ కౌన్సిలర్ ఎడ్ల రమేశ్ చండీయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడారు. యాగాలు, యజ్ఞాలు చేస్తే ప్రకృతిని కాపాడటమే కాకుండా ఆధ్యాత్మిక చింతన అలవడుతుందన్నారు. మనిషి తన స్వార్థం కోసం ప్రకృతిని ధ్వంసం చేయడంతోనే అకాల వర్షాలు కురుస్తున్నాయన్నారు. ప్రకృతిని రక్షించుకుంటే, అది మనల్ని రక్షిస్తుందన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్‌ఎం

సంగారెడ్డిటౌన్: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మెదక్ రీజియన్ పరిధిలో శుక్రవారం డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రీజినల్ మేనేజర్ ఎస్.సుదర్శన్ గురువారం తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని, సలహాలు, సూచనలకు ప్రయాణికులు 8500376267 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.



కోహీర్‌లోని అప్రోచ్ రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు



కోహీర్ మండలం లాల్‌సింగ్ తండాలో నేలవాలిన జొన్న పంట

8.9 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదు

జహీరాబాద్: జహీరాబాద్ నియోజకవర్గంలోని మొగుడంపల్లి మండలంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వడగండ్ల వాన పడింది. మొగుడంపల్లిలో 8.9 సెం.మీ వర్షపాతం నమోదైంది. జహీరాబాద్ మండలంలోని మల్‌చల్మ గ్రామంలో 6.5 సెం.మీ, అల్గోల్‌లో 3.6 సెం.మీ, సత్వార్‌లో 2.3 సెం.మీ మేర వర్షం కురిసింది. దీంతో పలు పంటలు దెబ్బతిన్నాయి. మొక్కజొన్న, జొన్న, సోయాబీన్, చెరకు పంటలకు నష్టం వాటిల్లింది.

ఆశ్రమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు



ఆశ్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు

పటాన్‌చెరుటౌన్: ఆశ్రమ పరిసరాలను, భోజనశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు అన్నారు. జిల్లా అమీన్‌పూర్ 'ది నేస్టూ అనాథ, వృద్ధాశ్రమాన్ని' గురువారం సందర్శించారు. సదుపాయాల కల్పనపై వృద్ధులను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలని సూచించారు.

విద్యా విధానం సదస్సును జయప్రదం చేయాలి

విద్యా పరిరక్షణ కమిటీ పిలుపు



కరపత్రాన్ని విడుదల చేస్తున్న విద్యాపరిరక్షణ కమిటీ నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): నూతన జాతీయ విద్యా విధానంపై శుక్రవారం నిర్వహిస్తున్న సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ పిలుపు ఇచ్చింది. ఈ మేరకు గురువారం సంగారెడ్డిలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో విద్యా పరిరక్షణ కమిటీ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్య ప్రైవేటీకరణ, కాషాయికరణ, కార్పొరేటీకరణ చేయడం విద్యకు విఘాతం కలిగించడమవుతుందన్నారు. విద్యను హేతుబద్ధీకరణ పేరుతో సైన్స్ పాఠ్యాంశాలను తొలగించడం విద్యార్థులను సైంటిఫిక్ టెంపర్ నుంచి దూరం చేయడమేనన్నారు. ప్రపంచ వ్యాప్తంగా శాస్త్రం పురోభివృద్ధి చెందుతుంటే, భారత దేశంలో ఆశాస్త్రీయ విధానాలతో విద్యకు విఘాతాలను సృష్టిస్తున్నారన్నారు. నూతన జాతీయ విధానం అమలు చేస్తే, దాని ఫలితాలు, పర్యవసానాలు ఏ విధంగా ఉంటాయో సమాజానికి తెలియజెప్పేందుకు శుక్రవారం సంగారెడ్డిలోని గాంధీ సెంటినరీ హైస్కూల్‌లో సాయంత్రం 4 గంటలకు నిర్వహించే సదస్సుకు హాజరు కావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సంజీవయ్య, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్, రాష్ట్ర కౌన్సిలర్ లక్ష్మయ్య యాదవ్, జిల్లా కార్యదర్శి మల్లికార్జున్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్ పాల్గొన్నారు.

మంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన



సభా స్థలంపై చర్చిస్తున్న అదనపు కలెక్టర్

మునిపల్లి(అందోల్): ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ అజయ్ కుమార్, తహసీల్దార్ శివకుమార్ పరిశీలించారు. గురువారం మండలంలోని చిన్నచల్మెడ గ్రామ శివారులో మంత్రి సభ స్థల పరిశీలన చేశారు. ఈనెల 29వ తేదీన ఉదయం 11.30 గంటలకు ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు శ్రీ సంగమేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్, ప్రాజెక్టు పంప్‌హౌస్ పనులు ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయ్ భాస్కర్, రాష్ట్ర నాయకుడు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

గంజాయి విక్రేత అరెస్ట్

గజ్వేల్‌రూరల్‌: గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని 100గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్న సంఘటన గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ముట్రాజ్‌పల్లి మార్గంలో చోటు చేసుకుంది. సీఐ వీరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... రాజస్థాన్ ప్రాంతానికి చెందిన సంతోషి జీవనోపాధి కోసం గజ్వేల్‌కు వచ్చి నివాసముంటున్నాడు. రాజస్థాన్ నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి గజ్వేల్ ప్రాంతంలో పలువురికి విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం ఎస్ఐ నరేష్ సిబ్బందితో దాడులు నిర్వహించి పట్టుకున్నారు. ఈ దాడుల్లో ఐడీ పార్టీ సిబ్బంది వెంకటేశ్, యాదగిరి, రవి, సిబ్బంది నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతదేహం లభ్యం


సాధు సాయి కుమార్ (ఫైల్)

పాపన్నపేట(మెదక్‌): పాపన్నపేట ఏడుపాయల్లోని కన్వెన్షన్ సెంటర్ వెనకాల గుట్టపై చెట్టుకు ఉరేసుకొని అనుమానాస్పద స్థితిలో ఓ మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ విజయ్ తెలిపిన వివరాల ప్రకారం..కొత్తపల్లికి చెందిన సాధు అంతయ్య, మంజుల కుమారుడు సాధు సాయి కుమార్(22) ఏడుపాయల కమాన్ వద్ద టెంట్ హౌజ్‌లో పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. రెండు మూడు రోజుల కోసారి ఇంటికొచ్చి వెళ్లేవాడు. ఈ క్రమంలో ఉగాది తర్వాత కనిపించకుండా పోయాడు. కుటుంబీకులు ఎంత వెతికినా ప్రయోజనం లేక పోవడంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. గురువారం ఏడుపాయల్లో చెట్టుకు ఉరి వేసుకున్న మృతదేహం లభ్యమైంది. దీంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు



దుబ్బాకరూరల్‌: అక్బర్‌పేటభూంపల్లి మండలం పోతారెడ్డిపేట వద్ద గురువారం సిద్దిపేట వైపు నుంచి వస్తున్న ఒక కారు ప్రమాదవశాత్తు రోడ్డు ప్రక్కన కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలే దు. ఎస్ఐ గంగరాజును వివరణ కోరగా తమ కు ఎలాంటి సమాచారం అందలేదన్నారు.

దౌర్జన్యం చేసిన వీఆర్‌ఏపై ఫిర్యాదు

నారాయణఖేడ్‌: గౌడకులస్తులను దూషించి కల్లుదుకాణంపై దాడిచేసి దౌర్జన్యానికి పాల్పడ్డ నిజాంపేట్ వీఆర్‌ఏ బేతయ్యపై చర్యలు తీసుకోవాలని గురువారం ఆ సంఘం నాయకులు తహసీల్దార్ మదన్‌కు, సర్పంచ్ జగన్‌వారికి వినతిపత్రాలు సమర్పించారు. వివరాలు ఇలా ఉన్నాయి..వీఆర్‌ఏ బేతయ్య కల్లు దుకాణంపై దాడిచేయడమే కాకుండా నిర్వాహకుడిని కులంపేరుతో దూషించి కల్లుసీసాలను ధ్వంసం చేసి దౌర్జన్యానికి పాల్పడ్డాడని సంఘం నాయకులు పేర్కొన్నారు. రెవెన్యూ శాఖలో విధులు నిర్వహించే వీఆర్‌ఏ ఈ విధంగా దౌర్జన్యానికి పాల్పడడం దారుణమని అన్నారు. వెంటనే ఆయనపై చర్యలు తీసుకోవాలని వారు వినతిపత్రంలో కోరారు.

- రేపే నవోదయ ఎంట్రెన్స్
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 29 పరీక్ష కేంద్రాలు

అంతా సిద్ధం...



వర్గల్ నవోదయ విద్యాలయం

వర్గల్(గజ్వేల్‌): ఉమ్మడి మెదక్‌జిల్లావ్యాప్తంగా నవోదయ ఎంట్రెన్స్ టెస్ట్‌కు రంగం సిద్ధమైంది. 2023-24 విద్యాసంవత్సరంలో ఆరోతరగతి ప్రవేశం కోసం ఈ నెల 29న నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహణకు ఆయా జిల్లాల యంత్రాంగం సన్నద్ధమైంది. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలకు చెందిన విద్యాశాఖ అధికారులు, వర్గల్ నవోదయ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. మూడు జిల్లాల్లో పరీక్ష నిర్వహణకు సంబంధించి సెంటర్ లెవెల్ అబ్జర్వర్లు, సెంటర్ సూపరింటెండెంట్లకు ఓరియంటేషన్ కూడా నిర్వహించారు. ఏర్పాట్లకు సంబంధించిన వివరాలు వర్గల్ నవోదయ ప్రిన్సిపాల్ రమేష్‌రావు వెల్లడించారు.

5691 మంది విద్యార్థులు

నవోదయ ప్రవేశ పరీక్షకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 5691 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

- సంగారెడ్డి జిల్లా నుంచి 2337, మెదక్ జిల్లా నుంచి 1504, సిద్దిపేట జిల్లా నుంచి 1850 మంది పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు.
- సంగారెడ్డి జిల్లాలో 12, మెదక్ జిల్లాలో 7, సిద్దిపేట జిల్లాలో 10 చొప్పున మొత్తం 29 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా సజావుగా పరీక్ష నిర్వహించేందుకు ప్రతి కేంద్రంలో ఒక సెంటర్ సూపరింటెండెంట్, ఒక సెంటర్ లెవల్ అబ్జర్వర్‌ను నియమించారు.
- విద్యాశాఖ ఆదేశాలకు అనుగుణంగా ఒక్కో గదిలో 24 మంది విద్యార్థులు, ఒక ఇన్విజిలేటర్ ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ కేంద్రాలపై పర్యవేక్షణ బాధ్యతను మండల విద్యాధికారులకు అప్పగించారు.

సమాచారం కోసం హెల్ప్‌డెస్క్

నవోదయ ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన సమాచారం, అనుమానాల నివృత్తి కోసం ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు.

పరీక్ష కేంద్రాలకు ముందే చేరుకోవాలి



శనివారం ఉదయం 11.15 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. విద్యార్థులు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రానికి ఉదయం 10.30 గంటల వరకు చేరుకోవాలి. ఉదయం 11.30 తర్వాత అనుమతి ఉండదు. అభ్యర్థులు తమ వెంట హాల్‌టికెట్(అడ్మిట్‌కార్డు), రైటింగ్ ప్యాడ్, బ్లూ లేదా బ్లాక్ బాల్‌పాయింట్ పెన్ను తీసుకురావాలి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఉంటుంది.

– రమేష్‌రావు, వర్గల్ నవోదయ ప్రిన్సిపాల్

హెల్ప్‌డెస్క్ సెల్‌నంబర్లు:

- ఎం కృష్ణారెడ్డి(లైబ్రేరియన్): 98666 48838
- నవోదయ వైస్ ప్రిన్సిపాల్: 73820 86533
- ఎస్వీ సుబ్బారెడ్డి (అధ్యాపకుడు): 94903 56731
- విద్యాపాటిల్ (ఎఫ్‌సీఎస్‌ఏ): 88841 78433

సైబర్ నేరాలపై అవగాహన

దుబ్బాకరూరల్‌: అక్బర్‌పేటభూంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పోతారెడ్డిపేటలో గురువారం సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ రవీందర్ సైబర్ నేరాలు, దిశ యాప్స్, పోక్సో కేసులు, మహిళలపై జరుగుతున్న దాడులు, రోడ్డు భద్రత, వాహనాల ఇన్సూరెన్స్, హెల్మెట్ ధరించడం వంటి వాటిపై అవగాహన కల్పించారు. సెల్ ఫోన్లో వచ్చే మెసెజ్‌లకు స్పందించకూడదన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శంకర్, ఎంపీటీసీ చందసాగర్, కానిస్టేబుల్ రాజిరెడ్డి, సంపత్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌రూరల్‌లో

హుస్నాబాద్‌రూరల్‌: సైబర్‌నేరాలపై జాగ్రత్తంగా ఉండాలని ఎస్ఐ మహేశ్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి మహ్మదాపూర్ గ్రామంలో సైబర్ నేరాలపై కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల యువత సైబర్ నేరాలపై అవగహన పెంచుకోవాలన్నారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ లిఫ్ట్ చేయొద్దన్నారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడితే 100 ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిట్టల సంపత్, ఎంపీటీసీ పిట్టల శ్రావణి, ఉపసర్పంచ్ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ముగ్గురి అదృశ్యం

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు అదశ్యమయ్యారు. కాలేజీకి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి ఓ విద్యార్థి తిరిగి రాలేదు. కుటుంబ కలహాలతో ఓ మహిళ అత్తారింటికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి అదృశ్యమైంది. భర్తతో గొడవపడి మనస్తాపానికి గురై మరో మహిళ ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన అన్నారంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి..


పద్మ(ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్‌): కుటుంబ కలహాలతో పుట్టింటికి వచ్చిన మహిళ అత్తారింటికి వెలుతున్నానని చెప్పి అదృశ్యమైన సంఘటన చిన్నశంకరంపేట మండలం రుద్రారం గ్రామంలో చోటుచేసుకుంది. చిన్నశంకరంపేట ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన కొలుపుల దుర్గమ్మ రెండో కూతురు పద్మను వెల్దుర్తి మండలం ఉప్పులింగాపూర్ గ్రామానికి చెందిన పట్నం నాగులకు ఇచ్చి అరు సంవత్సరాల క్రితం వివాహం చేశారు. కాగా వారం రోజుల క్రితం అత్తగారింట్లో గొడవ పడి తల్లిగారి ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో ఆమె అత్తారింటికి వెలుతున్నానని తల్లి దుర్గమ్మకు చెప్పి వెళ్లింది. కానీ పద్మ తమ వద్దకు రాలేదని భర్త నాగులు భార్య కుటుంబ సభ్యులకు సమాచామిచ్చాడు. తల్లి దుర్గమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సుభాష్‌గౌడ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థి


రాకేశ్ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: బీఎస్సీ ఫస్ట్ ఇయర్ చదువుతున్న గీతం విద్యార్థి అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..అమీన్ పూర్ మండల పరిధిలోని ఐలాపూర్ గ్రామానికి చెందిన కుర్మ రాకేష్(21) పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారం గీతం యూనివర్సిటీలో బీఎస్సీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం ఉదయం కాలేజీకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో విద్యార్థికోసం కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కుమారుడు అదృశ్యంపై తండ్రి విట్టల్ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భర్తతో గొడవ పడి గృహిణి..


స్రవంతి (ఫైల్)

జిన్నారం(పటాన్ చేరు): భర్తతో గొడవపడి మనస్థాపానికి గురై ఓ వివాహిత ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన అన్నారంలో జరిగింది. గుమ్మడిదల ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం..అన్నారం గ్రామానికి చెందిన శంకర్‌కు పదమూడేళ్ల క్రితం స్రవంతితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈ నెల 25న రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్థాపానికి గురైన స్రవంతి ఇంటినుంచి బంధువుల వద్దకు తన పిల్లలతో వెళ్లింది. పిల్లలను బంధువుల ఇంట్లో ఉంచి స్రవంతి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. భర్త ఫిర్యాదు మేరకు ఎస్ఐ జయకృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆన్‌లైన్‌లో ఇన్వెస్ట్ చేసి..

యువకుడి ఆత్మహత్య


అరవింద్ (ఫైల్)

సంగారెడ్డి మున్సిపాలిటీ: సాఫ్ట్ వేర్ జాబ్ చేస్తూ టెలీగ్రామ్‌లో వచ్చిన లింక్ ఓపెన్ చేసి వర్క్ ఫ్రమ్ హోం ఎంచుకున్న అరవింద్(30) రూ.12,50,525లు పోగొట్టుకుని మనస్తాపంతో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆన్‌లైన్లో టెలీగ్రాంలో కొన్ని టాస్క్‌లకు రూ.200 ఇన్వెస్ట్ చేస్తే రూ.250వస్తుందని తెలుసుకున్నాడు. ఈ క్రమంలో అతను ఆన్‌లైన్లో ఇన్వెస్ట్ చేశాడు. దీంతో గెలిచిన సొమ్మును సైబర్ నేరస్తులు అతనికి పంపారు. సైబర్ నేరస్తుల వలలో చిక్కుకున్న అరవింద్ అత్యాశతో రూ.12 లక్షల పైచిలుకు టాస్క్‌కోసం పెట్టి పోగొట్టుకున్నాడు.

చెల్లె పెళ్లికి దాచిన నగదు

సైబర్ నేరస్తుల వలలో చిక్కి డబ్బులు పోగొట్టుకున్న అరవింద్ మనస్థాపానికి గురయ్యాడు. వచ్చే నెల 5న తన చెల్లె పెళ్లి ఉండడంతో ఇంట్లో ఖర్చుల నిమిత్తం ఇచ్చిన డబ్బులను అరవింద్ ఆన్‌లైన్లో పోగొట్టుకున్నాడు. చేసిన అప్పులు తీర్చలేక, చెల్లి పెళ్లికి వాడుకున్న డబ్బులు తిరిగి రాబట్టుకోలేక మనస్తాపంతో తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రమాదవశాత్తు కిందపడి వ్యక్తి మృతి

చేగుంట(తూప్రాన్‌): ప్రమాదవశాత్తు కింద పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి వడియారం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కరీంనగర్ గ్రామానికి చెందిన పోచయ్య(56) మేస్త్రీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి తన వెంట వచ్చిన కూలీలను వడియారం గ్రామంలో బైక్‌పై దింపడానికి వెళ్లాడు. కూలీలను దింపి తిరిగి వస్తున్న క్రమంలో అకస్మాత్తుగా కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తప్పిపోయిన వృద్ధుడి అప్పగింత

నారాయణఖేడ్‌: తప్పిపోయిన వృద్ధుడిని కుటుంబ సభ్యులకు అప్పగించిన సంఘటన నారాయణఖేడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణఖేడ్ పట్టణంలో 90 ఏళ్ల ఓ వృద్ధుడు రెండురోజులుగా సంచరిస్తున్నాడని గురువారం కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొటారి నర్సింహులు, అంబేడ్కర్ ఫౌండేషన్ నిర్వాహకులు సంజీవ్‌కుమార్, రాజ్‌కుమార్ అతణ్ని గుర్తించారు. అనంతరం వృద్ధుడిని ఆరా తీయగా కర్ణాటకలోని చిల్లర్గి గ్రామమని, తన పేరు వడ్ల మోనప్ప అని వివరాలు చెప్పాడు. తాను తప్పిపోయి ఇక్కడకు చేరుకున్నానన్నాడు. వెంటనే ఈ విషయాన్ని అటుగా వెళుతున్న కానిస్టేబుల్ రమేశ్‌కు సమాచారమిచ్చారు. అనంతరం ఎస్ఐ వెంకటరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వృద్ధుడి కుటుంబీకులకు సమాచారం అందాజేసి వివరాలను నిర్ధారించుకున్నతరువాత వృద్ధుడిని కుటుంబ కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

నారాయణఖేడ్‌: ఏడాదికిందట పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసుశాఖ పోర్టల్‌తో ఆచూకీ తెలుసుకొని బాధితుడికి అప్పగించారు. నారాయణఖేడ్‌కు చెందిన పంచాయతీ కార్యదర్శి ఎస్.ప్రవీణ్‌కుమార్ తన సెల్‌ఫోన్‌ను ఏడాదిక్రితం పోగొట్టుకున్నాడు. పోలీసుశాఖ పోర్టల్‌లో మీసేవ ద్వారా దరఖాస్తు చేశాడు. ఫోన్ ఆన్‌లో ఉన్నట్లు తెలియడంతో పోలీసులు సదరు వ్యక్తినుంచి ఆఫోన్‌ను రికవరీ చేశారు. గురువారం సీఐ రామకృష్ణారెడ్డి దాన్ని ప్రవీణ్‌కుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకట్‌రెడ్డి, కానిస్టేబుల్ రమేష్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న హెల్పర్..


మహేందర్ (ఫైల్)

తొగుట(దుబ్బాక): విద్యుత్ షాక్‌కు గురై చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని బండారుపల్లిలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..గ్రామానికి చెందిన బుచ్చక్క మహేందర్ (41) గత కొంత కాలంగా గ్రామపంచాయతీ హెల్పర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 3న మెట్టు సబ్ స్టేషన్ సమీపంలో కరెంట్ మరమ్మతులు చేయాలని లైన్‌మైన్ తీసుకుపోయాడు. అక్కడ విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ సరఫరా జరిగింది. దీంతో మహేందర్‌కు తీవ్రగాయాలవ్వడంతో చికిత్సనిమిత్తం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందాడు. మృతునికి భార్య భాగ్యలక్ష్మీ, కుమార్తెలు వర్షిత, లిఖిత, కుమారుడు అవినాష్ ఉన్నారు.

దూడపై కుక్కలు దాడి

జగదేవ్‌పూర్(గజ్వేల్‌): కుక్కల దాడిలో దూడకు గాయాలైన సంఘటన మండలంలోని తిగుల్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తోళ్ల సత్తయ్యకు చెందిన దూడ ఇంటి ముందు ఉండగా కుక్కలు దాడి చేశాయి. దీంతో దూడకు గాయాలవడంతో పశువుల ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు.

మద్యానికి బానిసై వ్యక్తి..


మల్లేశం (ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్‌): మద్యానికి బానిసైన వ్యక్తి ఇంట్లో గొడవపడి పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం ఎస్ఐ శివప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కంచన్‌పల్లి గ్రామానికి చెందిన నీలబోయిన మల్లేశం(62)మద్యానికి బానిసై ఇంటివద్దే ఉంటున్నాడు. పలుమార్లు మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని భార్యాపిల్లలతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో బుధవారం కూడా భార్య జయమ్మ, కొడుకు నరేష్‌తో మద్యానికి డబ్బులు ఇవ్వాలని గొడవ పడ్డాడు. డబ్బులు లేవని చెప్పడంతో తనను ఎవరూ పట్టించుకోవడం లేదని మనస్థాపానికి గురై పురుగుల మందు సేవించాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పాడు. దీంతో అతడిని కౌడిపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన చికిత్సకోసం మెదక్ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మల్లేశం మృతిచెందినట్లు చెప్పారు. భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

కూలిన ఇంటి పైకప్పు

శివ్వంపేట(నర్సాపూర్‌): అకాల వర్షానికి పెంకుటిల్లు పై కప్పు కూలిన సంఘటన మండల పరిధిలోని శభాష్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఫయాజ్ కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబసభ్యులతో కలిసి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి పైకప్పు కూలింది. మట్టి పెల్లలు మీద పడడంతో ఫయాజ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే అప్రమత్తమై కుటుంబ సభ్యులను తీసుకొని బయటకు వచ్చాడు. బాధిత కుటుంబాన్ని సర్పంచ్ పార్వతిసత్యం పరామర్శించారు. ప్రభుత్వం ఫయాజ్‌కు ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.


కూలిన ఇంటి కప్పు


పాడి గేదె కళేబరం

విద్యుదాఘాతంతో పాడి గేదె మృత్యువాత

నంగునూరు(సిద్దిపేట): విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన సంఘటన గురువారం ఖానాపూర్‌లో చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన ఏర్వ విఠల్ గేదె పాలు పితికినంతరం మేతమేయడానికని వ్యవసాయ బావి వద్ద వదిలిపెట్టాడు. అక్కడ తెగిపడ్డ విద్యుత్ వైర్లను ఎవరూ గమనించ లేదు. దీంతో అక్కడ గడ్డి మేస్తున్న గేదె కింద పడి ఉన్న విద్యుత్ వైర్లను తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పాడి గేదె మృతితో రూ.60 వేల నష్టం జరిగిందని రైతు బోరున విలపించాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ బాలాజీ గోల్డ్. మీ బంగారం బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును.(స్పాట్ క్యాష్) తాకట్టు షిఫ్టింగ్ చేయబడును. 90320 40019. [T-44]

WANTED

■ ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం: 15000+ ఇన్సెంటివ్స్, ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684 [G-785891]

■ అద్భుత అవకాశం HYD లోగల ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఫిక్స్ శాలరీ+ కమీషన్+ ఇన్సెంటివ్స్+ రూం+ భోజనం ఉచితం. 10th, ఇంటర్, డిగ్రీ పాస్ ఫెయిల్ సంప్రదించండి. ఫోన్ : 9398021030 [H-781577]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్: 9848571888 [H-793420]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

దొంగతనానికి పాల్పడిన వ్యక్తికి జైలు

తూప్రాన్‌: లారీ డ్రైవర్లను కత్తితో బెదిరించి సెల్‌పోన్లు, నగదు ఎత్తుకెళ్లిన వ్యక్తికి న్యాయమూర్తి రీటా లాల్ చంద్ ఎనిమిది నెలల జైలుశిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధించినట్లు గురువారం ఎస్ఐ సురేశ్‌కుమార్ పేర్కొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. 2022లో పట్టణ సమీపంలోని కరీంగూడ చౌరస్తా వద్ద ఆగి ఉన్న లారీ డ్రైవర్లను కర్నూల్ జిల్లా కల్లూరి ఎస్టేట్‌కు చెందిన శికారి అర్జున్‌రెడ్డి చెత్త కాగితాలు ఏరుకొని జీవిస్తుంటాడు. ఈ క్రమంలోనే ఆగి ఉన్న లారీ డ్రైవర్లను కత్తితో బెదిరించి వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లు, కొంత నగదు దోచుకొని పారిపోయేవాడు. అప్పట్లో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడిని కోర్టులో హాజరుపరిచి చార్జ్‌షీట్ దాఖలుచేశామన్నారు. నిందితుడు నేరం ఒప్పుకోవడంతో న్యాయమూర్తి రీటా లాల్ చంద్ ఎనిమిది నెలల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించినట్లు తెలిపారు. సీఐ శ్రీధర్, ఎస్ఐ సురేశ్‌కుమార్, పీపీ నవీన్‌కుమార్, కోర్టు కానిస్టేబుల్ లక్ష్మారెడ్డిని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని అభినందించారు.

తేనెటీగల దాడి

తేనెటీగల దాడి చేసిన ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. అందులో కొండపాక మండలంలోని సిర్సనగండ్ల గ్రామానికి చెందిన వృద్ధుని పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు పేర్కొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి..


స్పృహ కోల్పోయిన బాల పోశయ్య

కొండపాక(గజ్వేల్‌): వ్యవసాయ బావి వద్ద తేనెటీగలు దాడి చేయడంతో పడిగె బాలపోశయ్య (70) తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ సంఘటన కొండపాక మండలంలోని సిర్సనగండ్ల గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. సిర్సనగండ్ల గ్రామానికి చెందిన పడిగె బాల పోశయ్య రోజుమాదిరిగా వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. వ్యవసాయ పనులు చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేయడంతో స్పృహ తప్పి పడిపోయాడు. దీన్ని గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాల పోశయ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు పేర్కొన్నారు.

పరామర్శ


చికిత్స పొందుతున్న ఉపాధి కూలీ

తేనెటీగల దాడిలో తీవ్రంగా గాయపడిన రవీంద్రనగర్ గ్రామానికి చెందిన గుర్రాల పద్మ, మూడోజు తిరుపతి, కోడెల కనుకయ్య, చిల్ల బోయిన లింగయ్య, కుంచెం శ్రీకాంత్‌లను గురువారం ఎంపీపీ ర్యాగల్ల సుగుణ, ఎస్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణలు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు చింతల సాయిబాబా, సర్పంచ్ లింగారావు, ఉపసర్పంచ్ బర్మ కొమురయ్య, గ్రామాధ్యక్షుడు కోడెల మల్లేశం, నాయకులు రాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

అల్లాదుర్గం(మెదక్‌): ఉపాధి కూలీలపై తేనెటీగలు దాడి చేయడంతో ఇద్దరు కూలీలు గాయపడ్డారు. ఈ సంఘటన గురువారం అల్లాదుర్గం మండలంలోని వెంకట్‌రావుపేట గ్రామంలో చోటు చేసుకుంది. లోంకవాగులో ఫీడర్ చానల్‌లో పూడికతీత పనులు చేపడుతున్న క్రమంలో అక్కడే చెట్టుపై ఉన్న తేనెటీగల తెట్టెనుంచి ఒక్కసారిగా దాడి చేశాయి. దీంతో బాలయ్య, నాగయ్యలు గాయపడ్డారు. వీరిని అల్లాదుర్గంలోని ప్రైవెట్ క్లినిక్‌లో చికిత్సనిమిత్తం తరలించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ఉమ్మడి జిల్లాలో గురువారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు.

గుర్తుతెలియని వాహనం ఢీ కొని

చేగుంట(తూప్రాన్‌): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మాసాయిపేట శివారులో చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..మాసాయిపేటకు చెందిన పల్లపు వెంకటేశ్(36) వడ్డెర వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగా బుధవారం సాయంత్రం పనికెళ్లాడు. బండవద్ద నుంచి పనులు ముగించుకుని వస్తున్న క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయాలైన వెంకటేశ్‌ను తూప్రాన్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ


శారద (ఫైల్)

ములుగు(గజ్వేల్‌): ములుగు రెవెన్యూ కార్యాలయ సమీపంలో రాజీవ్‌రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ములుగు ఏఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం..సిద్దిపేట జిల్లా కోహెడ మండలం బస్వాపూర్‌కు చెందిన బూర్గుల శారద(38) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉప్పల్‌లోని చిలుకనగర్‌లో నివాసముంటున్నారు. మృతురాలు శారద తన భర్త బూర్గుల బాలుగౌడ్, బావ కూతురు రమ్యలు ముగ్గురు కలిసి హోండా ఆక్టీవా వాహనంపై గురువారం ఉదయం బెజ్జంకి నుంచి హైదరాబాద్‌కు వస్తున్నారు. ములుగు రెవెన్యూ కార్యాలయ సమీపంలోకి చేరుకోగానే ద్విచక్రవాహనం అదుపు తప్పి రాజీవ్‌రహదారిపై పడ్డారు. ద్విచక్రవాహనం వెనకాల కూర్చున్న మృతురాలు శారద రోడ్డుపై పడి లేచే క్రమంలో అతివేగంగా వస్తున్న డీసీఎం వాహనం అటునుంచి వస్తున్న కారును ఢీకొంది. ఆ కారు శారద ఛాతిపై నుంచి దూసుకెళ్లింది. దీంతో తీవ్ర గాయాలపాలైనా శారద అక్కడికక్కడే దుర్మరణం చెందింది. డీసీఎం వాహన డ్రైవర్ సంపత్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ పేర్కొన్నారు.

మొక్కజొన్న కంకులు విక్రయించే మహిళ


రోదిస్తున్న కుటుంబ సభ్యులు

గజ్వేల్‌రూరల్‌: రోడ్డు ప్రమాదంలో మొక్కజొన్న కంకులు విక్రయించే ఓ మహిళ మృతి చెందిన సంఘటన గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని గుండన్నపల్లి సమీపంలో చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గుండన్నపల్లికి చెందిన ఎక్కలదేవి రాజవ్వ(58)రోజు మాదిరిగానే గురువారం సైతం గుండన్నపల్లి సమీపంలో రాజీవ్ రహదారిపై మొక్కజొన్న కంకులను విక్రయిస్తుంది. ఈ క్రమంలో రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి ప్రజ్ఞాపూర్ వైపు అతివేగంగా వస్తున్న పార్చునర్ కారు ఢీకొనడంతో రాజవ్వ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.